రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, మే 18: ఓయూ పరిధిలోని పోస్ట్ ఎమ్మెస్సీ 'డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్' కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈనెల 24వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలన్నారు. పరీక్షలు వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు, పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్ సైట్ ww.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఐఎన్ఎస్ఏ అసోసియేట్ ఫెలోకు డా.సూర్యప్రకాశ్ సింగ్

సిటీబ్యూరో, మే 18(నమస్తే తెలంగాణ): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి చెందిన సీనియర్ సైంటిస్ట్ డా.సూర్యప్రకాశ్‌సింగ్ అత్యున్నతమైన ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ఫెలోగా ఎంపికయ్యారు. యువ పరిశోధకులను ప్రోత్సహించడమే లక్ష్యంగా సైంటిస్టులను గుర్తించి ఐఎన్ఎస్ఏ అసోసియేట్ ఫెలోతో సత్కరిస్తుంది. ఈ ఏడాదికిగాను ఆయన్ను ఎంపిక చేసింది. ఐఐటీలో సైంటిస్ట్‌గా సేవలు అందిస్తున్న ప్రకాశ్‌సింగ్ సోలార్ సెల్స్, ఆర్గానిక్ సెల్స్, పెరోవ్‌స్కైట్ సోలార్ సెల్స్, ఫొటో సైన్సిటైజర్స్‌లపై పరిశోధనలు చేస్తున్నారు. అదే విధంగా విష రహిత రంగులపై అధ్యయనం చేస్తుండగా.. ఈ ఏడాది ఆయన సీఆర్ఎస్ఐ బ్రూంజ్ మెడల్ అందుకున్నారు. అదే విధంగా ఎన్ఏఎస్ ఇచ్చే యంగ్ సైంటిస్ట్ ప్లాటినం జూబ్లీ అవార్డును, యంగ్ సైంటిస్ట్ అవార్డులను పొందారు. ఇప్పటివరకు అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్‌లో ఆయనకు చెందిన 225 పరిశోధన గ్రంథాలు ప్రచురితం కాగా, ఆయన సేవలకు తాజా పురస్కారాన్ని గెలుచుకున్నారని ఐఐసీటీ వర్గాలు తెలిపాయి. కాగా, అత్యున్నత పురస్కారానికి డా.ప్రకాశ్ సింగ్ ఎంపిక కావడంపై పలువురు ఆయనను అభినందించారు.

ఓయూ కాఫీ టేబుల్ పుస్తకం ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ, మే 18: ఓయూ కాఫీ టేబుల్ బుక్‌ను ఓయూ పరిపాలనా భవనంలోని సెనేట్‌హాల్‌లో ఓయూ అధికారులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ మాట్లాడుతూ..ఓయూ సమగ్ర ప్రగతిని ఈ పుస్తకం ద్వారా అందించామని చెప్పారు. 108 ఏండ్ల ఓయూకు చిహ్నంగా 108 పేజీలతో రూపొందించిన ఈ పుస్తకం ఓయూ ముఖచిత్రాన్ని అందిస్తుందని వివరించారు. న్యాక్ తనిఖీ కోసం సమగ్ర డాక్యుమెంట్ గాను ఇది ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. రిటైర్డ్ ప్రొఫెసర్ స్టీవెన్సన్ నేతృత్వంలోని బృందం రూపొందించిన ఈ పుస్తకంలో ఓయూకు పునాది రాయి వేసినప్పటి నుంచి నేటి వరకు సాధించిన విజయాలన్ని పొందుపరిచినట్లు చెప్పారు. భవిష్యత్తులో పుస్తకాన్ని మెరుగుపరిచేందుకు నిర్మాణాత్మక సూచనలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, ప్రొఫెసర్ రాములు, ప్రొఫెసర్ ప్యాట్రిక్, రఘుపతి, వివిధ ఫ్యాకల్టీల డీన్లు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

హోం గార్డులను సొంత రాష్ట్రానికి పంపించండి

కాచిగూడ, మే 18: తెలంగాణలో 30 ఏండ్లుగా పనిచేస్తున్న ఏపీ రాష్ట్రానికి చెందిన హోం గార్డులను సొంత రాష్ట్రానికి పంపించాలని హోం గార్డు ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాచిగూడలో శనివారం వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఏపీకి చెందిన వందలాది మంది హోం గార్డులు పనిచేస్తున్నారని, తమ కుటుంబాలు మాత్రం ఏపీలోనే నివసిస్తున్నారని పేర్కొన్నారు. కొంత కాలం ఇక్కడే విధ్యనభ్యసిస్తే ఏపీలో స్థానికత కోల్పోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు తెలంగాణ ఉన్నతాధికారులను కలిసి హోంగార్డులు పడుతున్న ఇబ్బందులు వివరించినట్లు తెలిపారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేద హోం గార్డుల కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని మానవతా దృక్పథంతో ఆంధ్రప్రదేశ్‌కు పంపించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హోం గార్డులు ఎస్.నారాయణరెడ్డి, శ్రీను, రంగా రెడ్డి, లక్ష్మీనారాయణ, మధు, లాజర్, తదితరులు పాల్గొన్నారు.

> ''30 ఏండ్లుగా ఆటోనే నమ్ముకున్న సాంబయ్య జీవితం ఒక్కసారిగా తారుమారైంది. ఆటోతోనే పిల్లల చదువులు, పెండ్లీలు జేసిన అతడికి ఇప్పుడు బతకడమే గగనంగా మారింది. కారణం కాంగ్రెస్ పాలన. ప్రతి నెల ఇంటి అద్దె చెల్లించే సాంబయ్య ఇప్పుడు రెండు నెలలు గడుస్తున్నా చెల్లించలేకపోయాడు. మరోవైపు తన ఆటో ఈఎంఐలు చెల్లించలేక మూడు కిస్తీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంటికి అల్లుడు, బిడ్డ వస్తే అద్దె చెల్లించలేని విషయం తెలుస్తుందని వారిని ఆహ్వానించడం కూడా వాయిదా వేసుకుంటున్నాడు. ఇలాంటి దుస్థితి ఇంకెవ్వరికి రావొద్దని సాంబయ్య కన్నీటి పర్యంతమవుతున్నాడు.''

> ''అతడి పేరు రాజు. 20 ఏండ్ల నుంచి ఆటోతోనే తన కుటుంబాన్ని పోశిస్తున్నాడు. ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజులు, నిత్యావసరాలు ఇలా అన్నింటికి ఆటోనే జీవనాధారంగా చేసుకున్నాడు. ఆటో నడిపితే వచ్చే ఆదాయంతోనే ఇన్నాళ్లు కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచాడు. ఎటువంటి పరిస్థితులొచ్చినా ఆటో ఉందనే నమ్మకమే అతడిని ఇన్నాళ్లు ధైర్యంగా ఉండేల చేసింది. కానీ ఇప్పుడు అదే ఆటో తనకు భారంగా మారింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆటో నడపడం చావుకు ఎదురెళ్లడంగా పరిణమించింది. ఇటు ఇంటి అద్దె చెల్లించడం, అటు కుటుంబాన్ని పోషించడం, దీనికి తోడు స్కూల్స్ పునఃప్రారంభం కాబోతుండటంతో ఖర్చులు తలకు మించిన భారంగా మారడంతో ఇటీవల అతడు అనారోగ్యం పాలయ్యాడు.''

> ''వాస్తవానికి ఆటోవాలాలకు ఆదాయం తెచ్చిపెట్టేది మహిళలే. పురుషులతో పోలిస్తే ఆటోలను ఎక్కువగా ఆశ్రయించేది వారే. ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు ఆటోల వైపు చూడటమే మానేశారు. దీంతో ఆటోడ్రైవర్ల ఆదాయం తగ్గి రోజువారీ జీవనం కూడా కష్టంగా మారింది. ఈ వేదన భరించలేక రాష్ట్రంలో ఇప్పటి వరకు 30 మందికి పైగా బలవన్మరణం చెందారు. వీరి చావులకు కాంగ్రెస్ సర్కార్ సమాధానం చెప్పాలని కుటుంబసభ్యులు, ఆటో యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.''

ఆటోవాలా జీవితం ఆగం

పిల్లల చదువు లెట్లా?.. కుటుంబం గడిచేదెట్లా..?

- ఇప్పటికీ ఆటోడ్రైవర్ల ఆర్థిక పరిస్థితిని పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్
- 30 మంది ఆటోడ్రైవర్ల బలవన్మరణం
- కాంగ్రెస్‌పై ఆటోవాలాల ఆగ్రహం

సిటీబ్యూరో, మే 18(నమస్తే తెలంగాణ): తెలిసింది ఒక్కటే వృత్తి.. అదే ఆటో నడపడం. ఇప్పుడు ఆ ఆటో నడపడమే శాపంగా మారడంతో ఏం చేయాలో తెలియక డ్రైవరన్నలు కుమిలిపోతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సాంబయ్య, రాజు లాంటి డ్రైవర్ల జీవితాల్లో చీకట్లను నింపింది. ఆటోనే జీవనాధారంగా బతుకుబండి నడుపుతున్న వారి ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసింది. తెల్లవారుజామునే ఆటోతో రోడ్డెక్కి.. తిరిగి అర్ధరాత్రి వరకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి కష్టార్జితంతో ఇంటికొచ్చే ఆటోవాలాలకు ఇప్పుడు గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. ఖాళీ ఆటోలతో అడ్డాలపై బిక్కుబిక్కుమంటూ ప్రయాణికుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇన్ని రోజులు ఎలాగో అలా నెట్టుకొచ్చినా.. మరో పది రోజుల్లో పిల్లల స్కూల్స్ ప్రారంభం కాబోతుండటంతో ఆటోడ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. అద్దె చెల్లించడమే తలకు మించిన భారంగా మారడంతో ఇక పిల్లలను చదివించడం ఎలా అని ఆవేదన చెందుతున్నారు. ఆటోడ్రైవర్ల జీవితాలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 30 మంది ఆటోడ్రైవర్లు బలవన్మరణం చెందారు. ఇంకెన్ని చావులు చూస్తే రేవంత్ సర్కార్ స్పందిస్తుందోనంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమీక్షలు గాలికే..!

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆటో కార్మికులకు ఏటా రూ.12వేలు ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించింది. ఇప్పుడెలాగూ బతుకుదెరువు పోవడంతో ఆ సాయమేదో పెంచాలని ఆటోడ్రైవర్లు రోడ్డు మీదకొచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆటో యూనియన్ నాయకులతో చర్చలు, సమీక్షలు చేశారు. లోక్‌సభ ఎన్నికలు సమీపించే వరకు చర్చల పేరిట కాలయాపన చేశారు. తీరా ఎన్నికల కోడ్ వచ్చిందంటూ చేతులెత్తేశారు. ఇప్పటికే పదుల సంఖ్యలో చర్చలు జరిపినా ఆటోవాలాల సమస్యను ప్రభుత్వం పరిష్కరించలేకపోయింది. లోక్‌సభ ఎన్నికలు ముగిసినా రాష్ట్ర ప్రభుత్వం ఆటోవాలాల సమస్యలపై దృష్టి సారించడంలేదని యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెలకు రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎంత మంది చస్తే స్పందిస్తారో చెప్పండి..

రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల మంది ఆటోడ్రైవర్లు ఉన్నారు. వారి బతుకులన్నీ రోడ్డున పడ్డాయి. చరిత్రలో ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం విన్నాం.. కానీ ప్రభుత్వం కారణంగా ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకోవడం ఇప్పుడే వింటున్నాం. ఇలాంటి ప్రభుత్వం ఎంతమంది ఆటోడ్రైవర్లు చనిపోతే స్పందిస్తుందో చెప్పాలి. ఆటోడ్రైవర్ల ఆర్థిక పరిస్థితి ఘోరంగా ఉంది. ప్రభుత్వం పట్టించుకోకపోతే ఆత్మహత్యలు పెరిగే ప్రమాదం ఉంది.

– ఎస్.రామకృష్ణ, ఆటో యూనియన్ నాయకుడు

బతకడమే భారమైంది..

నాకు ఇద్దరు పిల్లలు.. ఇంజినీరింగ్ చేస్తున్నారు. ఇన్నాళ్లు ఆటోతోనే పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు ఎల్లదీశాను.. కానీ ఇప్పుడు ఆటో నడిపే పరిస్థితిలేదు. ఖర్చులు పెరిగిపోయాయి. ఇంటి అద్దె రూ.7వేలు, కాలేజీ ఫీజులు లక్ష, ఇంటి ఖర్చులు రూ.6వేలు. ఇలా అన్నింటిని ఎలా సమకూర్చుకోవాలో తెలియక నాకు ఛాతినొప్పి వచ్చినట్టుంది. సరిగా నిద్ర కూడా పట్టడంలేదు. ఇప్పుడు బతకడమెలా అనే ఆలోచన వచ్చినప్పుడల్లా భయంగా అనిపిస్తున్నది. ఆటోలకు గిరాకీ లేదు. ఆటో ఈఎంఐలు చెల్లించలేకపోతున్నాం. ప్రభుత్వం ఎలాగైనా ఆదుకోవాలి.

– అశోక్, ఆటోడ్రైవర్, ఎల్బీనగర్

కిరాయి చెల్లించలేని దుస్థితి

20 ఏండ్ల నుంచి ఆటో నడుపుతున్నా. ఇలాంటి దుస్థితి ఎప్పుడు రాలేదు. మొదట్నుంచి కాంగ్రెస్ పాలనలోనే కష్టాలు పడుతున్నాం. రాష్ట్రం రాక ముందు కాంగ్రెస్ పాలనలోనే ఇబ్బందులు పడ్డాం. రాష్ట్రం తెచ్చుకుని కేసీఆర్ ప్రభుత్వంలో సంతోషంగా బతికాం. కానీ మళ్లీ కాంగ్రెస్ వచ్చి మా బతుకులను రోడ్డున పడేసింది. ఆటోనే ఆధారం. ఇతర ఆస్తి ఏదీ లేదు. రూ.200 కూడా మిగులుత లేవు. ఎట్ల బతికేది? ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యే శరణ్యం.

– భిక్షపతి, ఆటోడ్రైవర్, వనస్థలిపురం

ఆటో అమ్మినా.. కొనేవాళ్లు లేరాయె..

ఆటో ఈఎంఐ చెల్లించకపోతే ఆటో తీసుకెళ్తామని ఫైనాన్స్ వాళ్లు బెదిరిస్తున్నారు. 45 రోజుల సమయం ఇచ్చారు. గిరాకీ లేక ఎక్కడి కిస్తీలు అక్కడే ఆగిపోయాయి. ఆటో అమ్ముకుందామన్నా కొనేవాళ్లు లేరు. ఇలాంటి పరిస్థితి 30 ఏండ్లలో రాలేదు. కాంగ్రెస్ పాలన మా పాలిట మృత్యువుగా మారింది.

– ఎస్.రాములు, ఆటోడ్రైవర్, మాదన్నపేట

ఇప్పటికీ.. గుర్తింపు దక్కని త్యాగాలెన్నో..

- ఉద్యమకారుల సమావేశంలో ప్రొ. ననుమాస స్వామి

ఉద్యమకారుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. ననుమాస స్వామి

సికింద్రాబాద్, మే 18: రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో ఎంతో మంది అమరులయ్యారని, కానీ వారి కుటుంబాలకు సరైన గుర్తింపు ఇప్పటికీ దక్కలేదని హైకోర్ట్ న్యాయవాది ప్రొఫెసర్ ననుమాస స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన వారిలో ఇప్పటికీ కొందరి పేర్లు చరిత్రలో లిఖించబడలేదని వాపోయారు. నాడు ఆ త్యాగధనుల జీవితాలే తొలి తెలంగాణ ఉద్యమ చరిత్రకు ప్రాణం పోశాయన్నారు. సీతాఫల్‌మండిలోని టీఆర్టీ క్వార్టర్స్‌లో శనివారం ఉద్యమకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ పోరాట యోధుల జీవితాలను గ్రంథస్తం చేస్తున్నానని ఆయన తెలిపారు. అప్పటి ఉమ్మడి ప్రభుత్వాల నియంతృత్వ చట్టాల కింద అరెస్టయిన 2,100 మంది ఉద్యమకారుల వివరాలు సేకరించి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జనగాం జిల్లాకు చెందిన ఆడెపు వెంకయ్య, అనుమల రామయ్య, బి.ఇన్నారెడ్డి, ఉపేందర్ రావులు 1968 – 69లలో రెండేండ్లు జైలు పాలయ్యారని, అయినా.. వారికి దక్కాల్సిన న్యాయం జరగలేదని చెప్పారు. ఇలాంటి జైలు జీవితం గడిపిన వీరులు తెలంగాణలో ఎందరో ఉన్నారని అన్నారు. వీరికి తెలంగాణ రాష్ట్రం అందించే ఉద్యమకారుల పెన్షనే కాకుండా, కేంద్రం అందించే సైనిక సన్మాన్ ఫెన్షన్ కూడా వర్తించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆడెపు వెంకయ్య, అనుమల రామయ్య, బి.ఇన్నారెడ్డి, ఉపేందర్ రావులతో పాటు తెలంగాణ పోరాట యోధులు పాల్గొన్నారు.

జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

అబిడ్స్, మే 18: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జూన్ 8వ తేదీన చేప ప్రసాదం పంపిణీ చేసేందుకు బత్తిని కుటుంబ సభ్యులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా చేప ప్రసాదాన్ని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి చేప ప్రసాదం పంపిణీ గురించి వివరించనున్నట్లు సమాచారం. ప్రతి సంవత్సరం మృగశిర కార్తె ప్రవేశం సందర్భంగా చేప ప్రసాదాన్ని బత్తిని కుటుంబ సభ్యులు పంపిణీ చేస్తారు. ఈ చేప ప్రసాదాన్ని స్వీకరించేందుకు గాను దేశంలోని పలు రాష్ట్రాల నుంచి ప్రజలు తరలి వస్తారు. చేప ప్రసాదం పంపిణీకి గాను అవసరమైన మూలికలను తయారు చేసే పనిలో వారు నిమగ్నమైనట్లు సమాచారం. ఎప్పటిలాగే దూద్‌బౌలిలోని వారి నివాసంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, బావి పూజ చేసిన తరువాత ప్రసాదాన్ని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానానికి తరలించి పంపిణీని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సంవత్సరం మృగశిర కార్తె జూన్ 8వ తేదీన ప్రవేశించనుండడంతో ఆ రోజు పంపిణీ ప్రారంభించనున్నారు.

విద్యార్థి, యువత సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

- తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వీసీ విజ్జులత

వార్షిక వేడుకలను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ విజ్జులత

ఖైరతాబాద్, మే 18: విద్యార్థి, యువత సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజ్జులత అన్నారు. సైఫాబాద్‌లోని కళాశాల ఆడిటోరియంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కమ్యూనిటీ సైన్స్ కళాశాల 60వ వార్షికోత్సవం జరిగింది. ఈ వేడుకలను ప్రారంభించిన ప్రొఫెసర్ విజ్జులత మాట్లాడుతూ.. గంటల సేపు సామాజిక మాధ్యమాల్లో గడుపుతూ ప్రతి అంశానికి దానిపైనే ఆధారపడుతున్నారన్నారు. ఆధునిక టెక్నాలజీని అవసరమైనప్పుడే వినియోగించుకోవాలని, దానికి బానిస కావొద్దన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి దానికి మరింత మెరుగులు అద్దుకుంటే జీవితంలో మంచిస్థాయిలో స్థిరపడుతారన్నారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ సైన్స్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.విజయలక్ష్మి వార్షిక నివేదికను అందించగా, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ విద్యాశాఖ డైరెక్టర్, హెల్ప్‌డెస్క్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఎన్.సిద్ధోజిరావు, విద్యార్థి వ్యవహారాల ఇన్‌చార్జి శ్రీదేవి, డాక్టర్ సుధాకర్, మాజీ డీన్‌లు పాల్గొన్నారు.

కదిలిన అధికార యంత్రాంగం

బయట పడేసిన ఫర్నిచర్‌ను తరగతి గదుల్లో పెట్టిన సిబ్బంది

నిన్న ఆరుబయట ఫర్నిచర్

నేడు ఫర్నిచర్‌ను తొలగించిన దృశ్యం

బడంగ్‌పేట, మే 18 : 'ఇంత నిర్లక్ష్యమా?' అనే శీర్షికన శనివారం 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం కదిలింది. బాలాపూర్ మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరుబయట పడేసిన ఫర్నిచర్‌ను అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది తరగతి గదుల్లో పెట్టారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఫర్నిచర్‌ను పాఠశాల ప్రాంగణంలో ఆరుబయట పడేశారు. వానకు తడవడం, ఎండకు ఎండిపోయి ఫర్నిచర్ పూర్తిగా పాడైపోతుందని స్థానికులు ఆరోపణలు చేశారు. కోట్లు ఖర్చు పెట్టి 'మన ఊరు-మన బడి' కింద ప్రతి పాఠశాలకు అందజేసిన ఫర్నిచర్‌ను తరగతి గదుల్లో పెట్టాలని బడంగ్‌పేట కమిషనర్ రఘుకుమార్ ఆదేశాల మేరకు ఫర్నిచర్‌ను తరగతి గదుల్లోకి మార్చారు. మీర్‌పేట, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీల్లో కూడా ఫర్నిచర్‌ను తరగతి గదుల్లో పెట్టారు. విద్యాధికారులు సైతం కమిషనర్లకు ఫోన్లు చేసి పాఠశాలల బయట ఉన్న ఫర్నిచర్‌ను తరగతి గదుల్లో పెట్టించారు.

నార్సింగి మున్సిపాలిటీ హస్తగతం

చైర్మన్, వైస్ చైర్మన్‌లపై నెగ్గిన అవిశ్వాసం ● ఏకపక్షంగా చేతులెత్తిన 14 మంది కౌన్సిలర్లు

వివరాలు వెల్లడిస్తున్న ఆర్డీవో వెంకట్‌రెడ్డి, కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి

మణికొండ, మే 18: నార్సింగి మున్సిపాలిటీ పాలకవర్గం హస్తగతమైంది. బీఆర్ఎస్ పార్టీకి ఏడుగురు కౌన్సిలర్లు ఉండగా, ఒక స్వతంత్ర కౌన్సిలర్‌తో కలిపి ఒక్క బీజేపీ కౌన్సిలర్ పరోక్ష మద్దతును కూడగట్టి ఎంపీ, ఎమ్మెల్యేల ఎక్స్ అఫిషియో రెండు ఓట్లతో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను బీఆర్ఎస్ దక్కించుకుని గతంలో పాలకవర్గం ఏర్పాటు చేసింది. కాగా, ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని గత నెలల్లో జిల్లా కలెక్టర్‌కు కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. అందుకు శనివారం ఉదయం పదిన్నర గంటలకు బలాన్ని నిరూపించాలని కలెక్టర్ నోటీసులు జారీ చేయడంతో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మెజార్టీ సభ్యులతో కలిసి గోవాలో క్యాంపు రాజకీయాలకు తెర లేపారు. అయితే, మొన్నటి వరకు బీఆర్ఎస్‌లో ఉన్న నలుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ గూటికి చేరడంతో మొత్తం 12 మంది సభ్యులతో కలిసి గోవాలో నాలుగు రోజులుగా మకాం వేశారు. దీంతో బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ల పదవులకు కాపాడుకునేందుకు పార్టీ ఎమ్మెల్యే, స్థానిక నాయకులెవరూ పట్టించుకోకపోవడంతో అవిశ్వాసం ఏకపక్షంగా నెగ్గుతుందని అంతా భావించారు. అనుకున్నట్లే 12 మందితో గోవా నుంచి వచ్చిన కౌన్సిలర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రవేశపెట్టిన అవిశ్వాసానికి వెళ్తుండగా, వారితో మరో ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు మద్దతు పలకడంతో కాంగ్రెస్ అవిశ్వాసం ఏకపక్షమైంది. ముందుగా కొనసాగిన అవిశ్వాసంలో చైర్మన్ దారుగుపల్లి రేఖ యాదగిరిపై 14 మంది కౌన్సిలర్లు చేతులెత్తి వ్యతిరేకంగా మద్దతు పలకడంతో ఆమె పదవి కోల్పోయింది. అనంతరం, పన్నెండున్నర గంటలకు వైస్ చైర్మన్ గొల్ల వెంకటేష్ యాదవ్‌పై అవిశ్వాస తీర్మానంలోనూ అదే తీరును కొనసాగించడంతో ఆయన పదవి కోల్పోయినట్లు రిటర్నింగ్ అధికారి ఆర్డీవో వెంకట్‌రెడ్డి అధికారికంగా వెల్లడించారు. మెజార్టీ సభ్యుల ఆమోద నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపి త్వరలోనే నూతన చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల ఎన్నిక జరుపుతామని ఆర్డీవో తెలిపారు.

శిల్పారామంలో ముగిసిన సమ్మర్ క్యాంపు

అలరించిన నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, మే 18: మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపు శనివారంతో ముగిసింది. 15 రోజులుగా ఆర్టిసన్స్ మధుబని పెయింటింగ్, మట్టితో కుండల తయారీ, పెన్సిల్ స్కెచ్, మండల పెయింటింగ్, లిప్పన్ ఆర్ట్ గవ్వలతో బొమ్మల తయారీ, ట్రైబల్ పెయింటింగ్‌లలో శిక్షణ పొందిన 92 మందికి ప్రశంస పత్రాలను శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్ రావు చేతుల మీదుగా అందజేశారు. శిక్షణ సమయంలో ఆర్టిసన్స్ తయారీ చేసిన బొమ్మలతో పాటు వేసిన పెయింటింగ్‌లను ఆయన తిలకించారు. అనంతరం, సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో పలువురు కళాకారులు తమ ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. కలర్స్ ఆఫ్ డాన్స్ స్కూల్ గురువులు ఎన్ఎస్ఎల్ ప్రవీణ తన శిష్యబృందంతో కలిసి నర్తించిన కూచిపూడి నృత్యాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్

తోట బాలాజీ నాయుడు (ఫైల్)

జూబ్లీహిల్స్,మే18: కష్టపడకుండా డబ్బు సంపాదించేందుకు అదేపనిగా ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడికి హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు చెక్ పెట్టారు. గుంటూరు జిల్లా తెనాలి చెంచుపేటకు చెందిన తోట బాలాజీ నాయుడు (50) రామగండంలోని ఎన్టీపీసీలో ఏఈగా పనిచేస్తూ 2009 ఫిబ్రవరిలో ఒక ఎమ్మెల్యే పీఏ నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడి కరీంనగర్ జైలు పాలయ్యాడు. జైలు నుంచి విడుదలై కేసు విచారణ సమయంలో తనను ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శినంటూ.. పలువురు ఎమ్మెల్యేలను ఫోన్‌లో పరిచయం చేసుకుని ప్రభుత్వ కొత్త రుణ పథకంలో భాగంగా రూ.3,600 చొప్పున ముఖ్యమంత్రితో పాటు 100 మంది నుంచి డబ్బులు కట్టించాలని నమ్మించి రూ.3.60 లక్షలు చొప్పున వసూలు చేశాడు. లంచం తీసుకున్న కేసులో జైలు శిక్ష పూర్తయిన తరువాత విశాఖ పరవాడ సింహాద్రి పవర్ ప్లాంట్‌లో తిరిగి ఉద్యోగంలో చేరాడు. ఆర్థిక నేరాలకు అలవాటు పడ్డ నిందితుడు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో 37 కేసుల్లో ఈ తరహా మోసాలకు పాల్పడ్డాడు. కాగా హైదరాబాద్ సిటీ సైబర్ క్రైం ఏసీపీ ఆర్.జి. శివ మారుతి నేతృత్వంలో సైబర్ క్రైం పోలీసులు ఎట్టకేలకు సదరు నిందితున్ని అరెస్ట్ చేసి జైలుకు పంపారు.



ఇంజినీరింగ్ విద్యార్థులకు ఏఐ ఇంటర్న్‌షిప్

శేరిలింగంపల్లి, మే 18: ఇంజినీరింగ్ విద్యార్థుల్ల